సాక్షి పెద్దపల్లి

బుధవారం : 22 : ఫిబ్రవరి : 2023



పోచమ్మ తల్లికి బోనం

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.



దివ్యాంగుల ఉపాధికి రుణాలు

దివ్యాంగులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల యూనిట్లు మంజూరు చేసింది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/17.0

గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తొలిమెట్టు ప్రగతిపై సమీక్ష



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

రామగుండం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తొలిమెట్టు విధానాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా సెక్టోరియల్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. అంతర్గాం హైస్కూల్‌లో కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమికస్థాయి విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) చదవడం, రాయడం, తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులపై పట్టు సాధించేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. మార్చిలోగా విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల్లో మెరుగైన ఫలితాలు కనిపించాలని ఆదేశించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి ఓదెలు, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాస్, పొట్యాల హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, టీఎస్‌కేసీ, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా ఈనెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తోందని ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య తెలిపారు. 2015 నుంచి 2022మధ్య డిగ్రీ ఉత్తీర్ణులైన వారు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు అర్హులని, విప్రో, ఎలైట్ సొల్యూషన్స్, గూగుల్‌పే, జెన్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, టీంలీస్, కెరీర్ లాజిక్, సోలేరియా, ఆదర్శ మోటార్స్, క్రోమా కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూల్లో పాల్గొనాలని కోరారు.

గంగపుత్రులకు వలలు పంపిణీ



చేపల వలలు పంపిణీ చేస్తున్న ఏజీఎం

జ్యోతినగర్: గంగపుత్రులు చేపలు పట్టుకునేందుకు వీలుగా ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ ఆధ్వర్యంలో వలలు అందించారు. ఏజీఎం (హెచ్‌ఆర్ హెడ్) బిజయ్‌కుమార్ సిగ్దర్ ఆధ్వర్యంలో మంగళవారం మేడిపల్లి సెంటర్ సాయి సేవా సమితి ఆవరణలో కార్పొరేషన్ మూడో డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ సమక్షంలో జంగాలపల్లెకు చెందిన 25 మందికి వలలతోపాటు ఐస్‌బాక్స్‌లు అందించారు. సామాజిక సేవా బాధ్యత పథకంలో భాగంగా ప్రభావిత, పునరావాస గ్రామాల అభివృద్ధికి నిధులు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో డీజీఎం శామ్యూల్ ప్రశాంత్, గంగపుత్ర సంఘం సభ్యులు దామెరకుంట మల్లయ్య, లింగయ్య, మహేశ్, నర్సయ్య, పల్లికొండ నాగరాజు పాల్గొన్నారు.

28న జాతీయ వైజ్ఞానిక దినోత్సవం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని ఈనెల 28న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని డీఈవో మాధవి తెలిపారు. సీవీ.రామన్ తన రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజును సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఉపన్యాసం పోటీలు, సైన్స్ మేళాలు, బోధనాభ్యాసన సామగ్రి తయారీ, ప్రదర్శన వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు వారివారి తల్లిదండ్రులూ హాజరయ్యేలా చూడాలని హెచ్‌ఎంలకు సూచించారు.

మంథని సుందరీకరణపై ప్రత్యేక దృష్టి



పనులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: మంథని పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు తెలిపారు. మంగళవారం స్థానిక బొక్కలవాగు, రావులచెరువు, తమ్మిచెరువు కట్టలపై జరుగుతున్న పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి పరిశీలించారు. ఆయా చెరువు కట్టలపై వాకింగ్ ట్రాక్, సిమెంట్ రోడ్లతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మంథని పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, మరిన్ని పనులు పూర్తి చేసి ఆహ్లాదం పంచేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు వీకే.రవి, గర్రెపల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మూడు చిట్టీలు.. ఆరు మోసాలు..!



సుల్తానాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి స్థానికంగా పదేళ్లుగా చిట్టీలు నడుపుతున్నాడు. నమ్మకంగా ఉండడంతో చాలామంది అతడి వద్ద చిట్టీలు వేశారు. అందరి నుంచి పక్కాగా డబ్బులు కట్టించుకున్న అతడు.. చిట్టీ తీసుకున్న వారికి మాత్రం డబ్బులు ఇవ్వడంలో నెలల తరబడిగా ఆలస్యం చేసేవాడు. తాజాగా సుమారు రూ.2కోట్లతో కనిపించకుండా పోయాడు. చిట్టీలు వేస్తే పెద్ద మొత్తం ఒకేసారి చేతికి వస్తుందని ఆశపడిన ప్రజలకు అసలుకే ఎసరు వచ్చింది. వడ్డీ సంగతి దేవుడెరుగు.. చెల్లించిన డబ్బు కూడా వచ్చేలా లేదని బాధితులు లబోదిబోమంటున్నారు.

రామగుండంలో ఓ కార్మికుడు తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ఫైనాన్స్ కంపెనీని ఆశ్రయించాడు. బ్యాంకు ఏటీఎం కార్డు, పాస్ పుస్తకం తాకట్టు పెట్టి రూ.5 వడ్డీతో రూ.2లక్షలు అప్పు తీసుకున్నాడు. ప్రతినెలా వడ్డీ చెల్లించి.. మిగిలిన సొమ్మును డ్రా చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది సదరు కార్మికుడికి. విధులకు హాజరుకాకో.. మరేదైనా కారణంతో జీతం తక్కువ వచ్చినా.. వడ్డీ సదరు ఫైనాన్స్ కంపెనీకి చెల్లించాకే మిగితా సొమ్ము తీసుకోవాల్సి వస్తోంది. ఇలా అక్రమ చిట్టీలు, అధిక వడ్డీలతో ఫైనాన్స్ దందాలు జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్నాయి.

- జిల్లాలో యథేచ్ఛగా చిట్టీల వ్యాపారం
- పక్కాగా వసూలు.. ఆలస్యంగా చెల్లింపులు
- అన్నీ 'సెటిల్' అయ్యాక ఉడాయింపు
- అవసరమైతే కోర్టు నుంచి ఐపీ నోటీసులు
- కొత్తరకం దందాకు లేపుతున్న అక్రమార్కులు

సాక్షి, పెద్దపల్లి: చిట్టీల పేరుతో జనం నుంచి డబ్బులు వసూలు చేయడం.. వాటిని అధిక వడ్డీలకు అప్పు ఇవ్వడం వంటి అక్రమ ఫైనాన్స్ వ్యాపారం జిల్లాలో యథేచ్ఛగా సాగుతోంది. సామాన్యుల అవసరాలను ఆసరా చేసుకుంటున్న కొందరు అక్రమంగా సంపాదిస్తున్నారు. తేడా వస్తే వసూలు చేసుకున్న డబ్బుతో ఉడాయిస్తున్నారు. అవసరమైతే కోర్టు నుంచి ఐపీ పెడుతున్నారు. ఫైనాన్స్, మైక్రో ఫైనాన్స్ బిజినెస్ పేరుతో తెలిసిన వారితో చిట్టీలు వేయించడం.. ఆ పైసలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం లేదా అధిక వడ్డీలకు ఇతరులకు అప్పు ఇస్తున్నారు. అదే సమయంలో చిట్టీలు ఎత్తుకున్నవారికి సకాలంలో డబ్బులు ఇవ్వకుండా చుక్కలు చూపిస్తున్నారు.

పక్కాగా వసూలు... ఇచ్చేటప్పుడు చుక్కలు

కార్మికులు, చిరుద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలే లక్ష్యంగా చిట్‌ఫండ్ కంపెనీలు దందా సాగిస్తున్నాయి. చిట్టీ సభ్యులుగా చేర్చుకుని వారి నుంచి నెలనెలా పక్కాగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఒక్క నెల ఆలస్యమైనా.. ఏదైనా అవసరంపడి చెల్లించకున్నా.. వెంటపడుతున్నారు. డబ్బులు కట్టేవరకూ విడిచిపెట్టడం లేదు. తీరా సభ్యుడు తనకు అవసరమై చిట్టీ ఎత్తుకుంటే మాత్రం నెలల తరబడి తిప్పించుకుంటూ చుక్కలు చూపిస్తున్నారు. మరికొందరు చిట్టీలు చివరి దశలోకి చేరుకోగానే సభ్యులందరూ డబ్బులు కట్టడంలేదని, నష్టపోయానని ఏకంగా ఉడాయించి, ఐపీ పెడుతున్నారు. గతంలో జిల్లాలో ఇలా చిట్‌ఫండ్ డబ్బులతో పదుల సంఖ్యలో ఉడాయించి ఐపీ పెట్టినవారు ఉన్నారు.

ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు, ఏటీఎం కార్డులు

చిరు వ్యాపారులు, డైలీ కార్మికులు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు అధిక వడ్డీలకు అప్పు తీసుకుంటున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు తెల్లకాగితం, ప్రామిసరీ నోటుపై తేదీగానీ.. వివరాలుగానీ లేకుండా వారి నుంచి సంతకాలు తీసుకుంటున్నారు. ఉద్యోగులైతే వారి ఏటీఎం కార్డులు, బ్యాంక్ పాస్ పుస్తకాలు తీసుకుని వారి జీతం బ్యాంకులో పడగానే తమ వడ్డీ మినహాయించుకుని మిగిలిన నగదు ఇస్తున్నారు. ఒకవేళ అనారోగ్యంతో విధులకు హాజరుకాక నెల జీతం రాకుంటే వ్యక్తిగత పూచీకత్తు పెట్టిన కార్మికుల వేతనాల నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. ఇవి పలు సందర్భాల్లో కార్మికుల కుటుంబాల్లో గొడవలకు దారితీస్తున్నాయి. ఈ తతంగం జిల్లా అంతటా సాగుతున్నా.. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మాత్రం జోరందుకుంది.

పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతోనే

వడ్డీ వ్యాపారుల ఆగడాలు భరించలేక ధర్నాలు, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన సమయంలోనే పోలీసులు హడావుడి కనిపిస్తోంది. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో వడ్డీ వ్యాపారులను గుర్తించి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. తర్వాత ఆ విషయాన్ని పోలీసులు పట్టించుకోవడమే లేదు. పోలీసులు ఇప్పటికైనా అధికవడ్డీ వ్యాపారులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే కేసు



రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనుమతి తీసుకోకుండా నడిపిస్తున్న చిట్స్‌లో ఎవరూ చిట్టీలు వేయొద్దు. ఒకవేళ రిజిస్టర్ చిట్స్ వారు సకాలంలో డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తే బాధితులు ఫిర్యాదు చేయాలి. ఎవరైనా అధిక వడ్డీలకు డబ్బులిచ్చి వేధింపులకు గురి చేసినట్లు ఫిర్యాదు చేస్తే తప్పకుండా కేసులు నమోదు చేస్తాం.

– ఎడ్ల మహేశ్, ఏసీపీ పెద్దపల్లి

చిట్స్ నిబంధనలు ఇలా..

- ➜ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి
- ➜ రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి
- ➜ లావాదేవీలు అన్ని బ్యాంక్‌ల ద్వారా నిర్వహించాలి
- ➜ కొత్తగా గ్రూప్ ప్రారంభించినప్పుడు దాని విలువకు అదనంగా 50శాతం మెత్తాన్ని కలిపి రిజిస్ట్రేషన్ శాఖకు డిపాజిట్ చేయాలి
- ➜ సభ్యుల పూర్తి సమాచారాన్ని రిజిస్ట్రేషన్ శాఖకు అందించాలి
- ➜ వడ్డీ వ్యాపారం చేయాలంటే చలానా చెల్లించి రెవెన్యూ కార్యాలయం నుంచి లైసెన్స్ తీసుకోవాలి.
- ➜ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కానీ జిల్లాలో ఈ నిబంధనలు పాటించకుండానే వ్యాపారం నిర్వహిస్తున్నారు.

తూకాల్లో మోసాలు

కట్టడి చేస్తాం..



'సాక్షి'తో తూనికలు, కొలతల శాఖ అధికారి విశ్వేశ్వర్

- ఆకస్మికంగా తనిఖీలు చేపడతాం..
- అక్రమార్కులకు జరిమానా విధిస్తాం..
- రేషన్, ధాన్యం, పత్తికాంటాల వద్ద నిఘా
- ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదుల స్వీకరణ
- 94401 60509కు సమాచారమిచ్చినా స్పందిస్తాం

పెద్దపల్లిరూరల్: 'తూకం.. ధరల విషయంలో వినియోగదారులు వ్యాపారుల చేతిలో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలి. చట్టాలపై కనీస అవగాహన పెంచుకోవాలి. ప్యాకింగ్ వస్తువులపై తయారీదారు పూర్తి చిరునామా.. సెల్ నంబర్, కస్టమర్ కేర్ నంబర్‌తోపాటు తయారు తేదీ, తుది గడువు ముద్రించినవే కొనుగోలు చేయాలి. లేకుంటే మాకు సమాచారం అందించినా చర్యలు తీసుకుంటాం..' అని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి విశ్వేశ్వర్ అన్నారు. తన శాఖకు సంబంధించిన పలు అంశాలపై ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: జిల్లాలో వినియోగదారులకు అందిస్తున్న సేవలు..?

అధికారి: నిత్యావసర వస్తువును కొనే ప్రతి వినియోగదారుడు తమ హక్కులు, బాధ్యతలపై కనీస అవగాహన పెంచుకోవాలి. వినియోగదారుల రక్షణకు అనేక చట్టాలు అమల్లో ఉన్నాయి. వీలైనంత వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ వ్యాపారుల మోసాలను అరికడుతున్నాం.

సాక్షి: నిబంధనలను పాటించని వ్యాపారులపై తీసుకున్న చర్యలు..?

అధికారి: వ్యాపారులు తప్పనిసరిగా తూనికల శాఖ ద్వారా స్టాంపింగ్ అయిన కాంటాలనే వాడాలి. ప్యాకింగ్ వస్తువులపై నిబంధనల ప్రకారం పూర్తి చిరునామా తదితర సమాచారం ఉండాలి. నిబంధనలు పాటించకుండా విక్రయిస్తున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తాం.

సాక్షి: జిల్లావ్యాప్తంగా ఎంతమంది వ్యాపారులున్నారు..?

అధికారి: జిల్లాలో అనుమతి పొందిన వ్యాపారులు దాదాపు 4వేల వరకు ఉంటారు. అందులో 80 పెట్రోల్ పంపులు, 160 రైస్‌మిల్లులు, ఏడు జిన్నింగ్ మిల్లులు, 413 రేషన్ దుకాణాలు కూడా ఉన్నాయి.

సాక్షి: ఎమ్మార్పీ కన్న ఎక్కువ ధరలకు విక్రయిస్తే..?

అధికారి: ప్యాకింగ్ వస్తువులపై ముద్రించిన ధర కన్న ఎక్కువ ఇవ్వొద్దు. కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్లపై ఎక్కువ రేటు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. తనిఖీ చేసి జరిమానాలు విధించాం. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలు వసూలు చేసే వ్యాపారి నుంచి రశీదు తీసుకుని మాకు ఫిర్యాదు చేసినా స్పందిస్తాం.

సాక్షి: ఎరువులు, విత్తన వ్యాపారుల మోసాలపై తీసుకున్న చర్యలేంటి..?

అధికారి: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కొనుగోళ్ల మొదలు.. పంట దిగుబడుల అమ్మకాల వరకు తనిఖీలు నిర్వహిస్తూ రైతుల్లో అవగాహన పెంచుతున్నాం. ప్రతి దుకాణంలో ఎలక్ట్రానిక్ కాంటా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. రైతుల నుంచి దిగుబడి కొనే దళారులు తూకంలో మోసం చేస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశాం.

సాక్షి: రాళ్లతోనే తూకం వేస్తున్న వ్యాపారుల సంగతేంటి..?

అధికారి: ఈ సమస్య ఎక్కువ చేపల మార్కెట్, అక్కడక్కడా కూరగాయల వ్యాపారుల వద్ద కనబడుతోంది. చాలాసార్లు మందలించాం. జరిమానాలు విధించాం. కొంత మార్పు కనిపిస్తోంది.

సాక్షి: సూపర్‌మార్కెట్, రైస్‌డిపోల అక్రమాలపై..?

అధికారి: రైస్‌డిపోలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తక్కువ తూకం వేసిన బస్తాలను గుర్తించి సదరు వ్యాపారులపై చర్యలు తీసుకున్నాం. సూపర్‌మార్కెట్‌లలో ప్యాకింగ్ చేసి ఉంచిన వాటిని ఎలక్ట్రానిక్ కాంటాపై తూకం వేసి చూసుకోవాలి.

సాక్షి: ఆఫర్లతో ఆకర్షించే నూనె వ్యాపారులపై..?

అధికారి: లూజ్ నూనె అమ్మరాదు. ఆఫర్లు ప్రకటించడం కూడా నేరమే. కొన్ని ఆయిల్ కంపెనీలు కొన్ని గ్రాముల నూనె ఎక్కువ ఇస్తామంటూ ఆశచూపి మోసం చేసినట్లు గుర్తించి కేసులు నమోదు చేశాం. వినియోగదారులు ఆఫర్ల ఆకర్షణకు గురికావొద్దు.

బల్దియా బడ్జెట్‌కు కసరత్తు

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 2023–24కుగాను సాధారణ అంచనా బడ్జెట్‌ను రూపొందించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సుమన్ రావుతో కలిసి అకౌంట్ విభాగం అధికారులు రూ.300కోట్ల అంచనాలతో కొత్త బడ్జెట్ తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఈ అంచనాల బడ్జెట్‌ను కలెక్టర్ సంగీతకు సమర్పించినట్లు సమాచారం. ఆమె సూచనల మేరకు కొన్ని సవరణలు చేయడానికి మరోసారి మేయర్, కమిషనర్, అకౌంట్ విభాగం అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిసింది. ఈ నెలాఖరులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బడ్జెట్ ప్రవేశపెట్టి.. ప్రభుత్వ అనుమతికి పంపించనున్నట్లు చెబుతున్నారు.

మోదీ పాలనకు జనామోదం

- విపక్షాలన్నీ ఏకమైనా బీజేపీని ఓడించలేరు...
- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: నరేంద్రమోదీ పాలనకు దేశప్రజలంతా ఆమోదం తెలుపుతున్నారని, విపక్షాలన్నీ ఏకమైనా బీజేపీని ఓడించలేరని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో నియోజకవర్గస్థాయి నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు విసుగుచెందారని, ఆ పార్టీకి ఇవే చివరి ఎన్నికలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఏదో చేసినట్లు ప్రచారం చేసుకుంటున్న బీఆర్‌ఎస్.. రైతులకు ఎన్ని గంటల కరెంట్ ఇస్తోందో చెప్పాలన్నారు. ఈనెల 25న ఎస్‌ఈ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఈనెల 28న ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌పేటకు వస్తున్నారని, ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. నియోజకవర్గంలో 71 శక్తి కేంద్రాలు ఉన్నాయని, ఆయా కేంద్రాల ద్వారా మార్చి ఒకటి నుంచి నిర్వహించే సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఠాకూర్ రాంసింగ్, లింగారెడ్డి, పిన్నింటి రాజు, శ్రీనివాసరావు, తూడి రవి, పర్శ సమ్మయ్య, ఫహీం, పల్లె సదానందం, నారాయణస్వామి, శ్రీనివాసమూర్తి, సతీశ్ ఉన్నారు.

బీపీఎల్ భూములను రైతులకు అప్పగిస్తాం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్



లంబాడితండా వాసులతో మక్కాన్‌సింగ్‌ఠాకూర్

రామగుండం: బీపీఎల్ కంపెనీ కోసం రెండు దశాబ్దాల క్రితం రైతుల నుంచి తీసుకున్న భూములను తాము అధికారంలోకి రాగానే తిరిగి అప్పగించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ అన్నారు. బ్రాహ్మణపల్లితండాలో నివాసాలకు పట్టాలు పంపిణీ చేయిస్తామన్నారు. భూమి లేని నిరుపేదలకు ఎకరం చొప్పున ఇస్తామని అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆయన బ్రాహ్మణపల్లి, మర్రిపల్లి, లంబాడితండా, అంబేద్కర్ కాలనీల్లో పర్యటించారు. 50 మంది కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, సుధాకర్, అల్లనేరడి కనకయ్య, రమేశ్, శ్రీనివాస్, బాపు, రామ్మూర్తి, లింగమూర్తి ఉన్నారు.

హామీలు మరిచి నియంతపాలన

గోదావరిఖని: స్థానిక ఎమ్మెల్యే హామీలు మరిచి నియంతపాలన కొనసాగిస్తున్నాడని రాజ్‌ఠాగూర్ అన్నారు. స్థానిక 43వ డివిజన్‌లో పర్యటించి ప్రజల కష్టాలు తెలుసుకున్నారు. తన పాదయాత్రకు వస్తున్న ఆదరణ ఓర్వలేక కరపత్రాలు పంచుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. బొంతల రాజేశ్, రవికుమార్, ఎండీ ముస్తఫా, మహంకాళి స్వామి, గాధం విజయానంద్ పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి ప్రీ ఫైనల్స్

- మొదటి విడత ఈనెల 22 నుంచి 28 వరకు
- మార్చి 14 నుంచి 21 వరకు రెండో విడత..
- 11 పేపర్లకు బదులు ఆరు పేపర్లే..



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

సుల్తానాబాద్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు త్వరలో జరగనున్నాయి. అయితే ఆ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను అన్నివిధాలుగా సన్నద్ధం చేసేందుకు ప్రీ ఫైనల్ పరీక్షలను విద్యాశాఖ నిర్వహిస్తుంటుంది. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల్లో ఓ అవగాహన వస్తుంది. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఫైనల్ పరీక్షలు రాసే అవకాశముంటుంది. తద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తారు విద్యార్థులు. ఇలాంటి ప్రీ ఫైనల్ పరీక్షలను ఈ ఏడాది మొదటి విడత ఈనెల 22 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. రెండో విడత మార్చి 14 నుంచి 21 వరకు నిర్వహించనున్నారు. గతేడాది వరకు పదిలో 11 పేపర్లుగా పరీక్షలు నిర్వహించిన విద్యాశాఖ.. రాష్ట్రప్రభుత్వం చేసిన మార్పులతో ఆరు పేపర్లుగానే పరీక్షలు పెట్టనుంది.


డిసెంబర్ నుంచే ప్రత్యేక తరగతులు

జిల్లా విద్యాశాఖ పరిధిలో 183 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 7,937 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ బడుల్లోని విద్యార్థులకు బోధించే అంశాలపై ఇప్పటికే ప్రణాళిక విడుదల చేశారు. ఇందుకు ప్రత్యేక బుక్‌లెట్ తయారు చేసి జిల్లాలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు. పాఠ్యాంశాలవారీగా ఏ రోజు ఏం బోధించాలో నిర్దేశించారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో దీన్ని తయారు చేయించి.. కచ్చితంగా అమలు చేయాలని కూడా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా డిసెంబర్ నుంచే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పరీక్షలపై పూర్తి పట్టు కల్పించేందుకు ఈనెల 22 నుంచి 28వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. గతేడాది సగం ప్రశ్నలకే జవాబులు రాయాల్సి ఉండగా.. ఈసారి ఒక సెక్షన్ వ్యాసరూప ప్రశ్నల్లో మాత్రమే చాయిస్ ఇవ్వనున్నారు. పరీక్షల్లో మొత్తం 80 మార్కులు కాగా.. మిగతా 20 మార్కులు రెండు ఎఫ్ఏల్లో వచ్చిన మార్కుల సరాసరి తీసుకుని కలుపుతారు. పాఠ్యాంశాల నుంచి వచ్చే ప్రశ్నలు, ఛాయిస్ ఎలా ఉంటుంది..? ప్రశ్నపత్రం ఎలా ఉంటుంది..? ఏయే పాఠాలు చదివితే మంచి మార్కులు సాధించవచ్చు..? అనే సందేహాలతో ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులకు ఈ ప్రీ ఫైనల్ పరీక్షలు అవగాహన కల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

విద్యార్థులకు అవగాహన

పరీక్షల విధానం, ప్రశ్నల తీరుపై ఇప్పటికే ఉపాధ్యాయులకు టీశాట్ ద్వారా అవగాహన కల్పించారు. మొదటి విడత ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తవగానే ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఏ విషయాలపై.. ఎలా ప్రశ్నలు అడుగుతున్నారు అనే దానిపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఏయే సెక్షన్లలో ఎలాంటి ప్రశ్నలు వస్తాయి..? ఏ అంశాలను ఎక్కువగా చదవాలో తెలియజేయాలి. విద్యార్థులు ఏవైనా తప్పులు చేసినా.. వెనుకబడినట్లు అనిపించినా.. రెండో విడత నిర్వహించే ప్రీ ఫైనల్ వరకు సన్నద్ధం చేయాలి.


అవగాహన పెంచుకోవాలి



ప్రీ ఫైనల్ పరీక్షల్లో ప్రశ్నలు అడిగే తీరుపై విద్యార్థులు అవగాహన చేసుకుంటే ఫైనల్ పరీక్షల్లో ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయవచ్చు. ఈ పరీక్షలను విద్యార్థులు వినియోగించుకోవాలి. ఎలాంటి ప్రశ్నలు వేస్తున్నారు..? సమాధానాలు ఎలా రాయాలి..? అనే తీరుపై పూర్తి అవగాహన కల్పిస్తున్నాం.

– విజయ్‌రావు, హెచ్‌ఎం, బాలికల ఉన్నత పాఠశాల సుల్తానాబాద్

ఫైనల్‌కు ఉపయోగపడతాయి



ప్రీ ఫైనల్‌పై పూర్తి అవగాహన ఉంటే ఫైనల్‌కు ఇబ్బంది ఉండదు. ఒత్తిడికి గురవకుండా పరీక్షలు రాయాలి. ఈసారి రెండుసార్లు ప్రీ ఫైనల్ నిర్వహిస్తున్నాం. ఇది విద్యార్థులకు మంచి అవకాశం. ఉపాధ్యాయులు పూర్తి అవగాహన కల్పించి పిల్లల్లో భయం పోగొట్టాలి. మొదటి విడత పూర్తవగానే వారిని అన్ని విధాలా సన్నద్ధం చేయాలి. – మాధవి, డీఈవో

క్లుప్తంగా


24న కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్ రాయలింగు తదితరులు

కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నట్లు చైర్మన్ దాసరి రాయలింగు తెలిపారు. ప్రమాణ స్వీకార ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ వెంట వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు ఇనగంటి రామారావు, బాద్రపు మల్లేష్, రాసకొండ రవి, నీలి రాజయ్య, అనవేన వేణు, నడిగొట్టు సంపత్ తదితరులున్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ



మనోహర్‌రావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణానికి చెందిన తూముల మనోహర్ రావు ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు కోల్‌కతాలో జరిగిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్–2023 పోటీల్లో పాల్గొన్నాడు. హ్యామర్‌త్రో విభాగంలో సుత్తిని 33.39 మీటర్ల దూరం విసిరి, ప్రథమ స్థానంలో నిలిచి, మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నాడు. అథ్లెటిక్ అసోసియేషన్ నాయకులు, క్రీడాకారులు ఆయనను అభినందించారు.

జేబీసీసీఐ సమావేశాలు నిర్వహించాలి

రామగిరి(మంథని): సింగరేణి సంస్థలో 11వ జేబీసీసీఐ వేతన సమావేశాలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో ఏబీకేఎంఎస్, బీఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వేతన సవరణ కమిటీ తొమ్మిదో సమావేశం నిర్వహించాలని కోరుతూ దేశవ్యాప్తంగా ధర్నాలు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌వోటూ జీఎం రఘుపతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అరుకాల ప్రసాద్, వేణుగోపాల్‌రావు, మామిడి స్వామి, అనుప రమేశ్, శ్రీనివాస్, నగేశ్, అశోక్, కిషన్, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపాధికి రుణాలు

- జిల్లాకు 20 యూనిట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- దరఖాస్తుకు ఈ నెల 28 వరకు గడువు



ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

సుల్తానాబాద్(పెద్దపల్లి): దివ్యాంగులకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల యూనిట్లు మంజూరు చేసింది. దివ్యాంగులు దుకాణాలు ఏర్పాటు చేసుకొని, జీవనోపాధి పొందాలన్నది సర్కారు సంకల్పం. ఇప్పటికే వారికి పెన్షన్ అందిస్తుండగా ఇటీవల పెద్దపల్లి, గోదావరిఖని, మంథనిల్లో ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. విద్యార్హతలున్నవారికి, డిగ్రీ చేసేవారికి ల్యాప్‌టాప్‌లతోపాటు సెల్‌ఫోన్లు అందజేశారు. ఇప్పుడు రుణాలు మంజూరు చేస్తోందని, ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, వ్యాపారాలు చేసి, స్థిరమైన ఆదాయాన్ని పొందాలని చెబుతున్నారు.

జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు..

పెద్దపల్లి జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు, సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలతోపాటు రామగుండం కార్పొరేషన్ ఉన్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను దివ్యాంగుల కోసం జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం 20 యూనిట్లు మంజూరు చేసింది. వీటిలో రూ.50 వేల విలువైనవి 14 మండలాలకు మండలానికి ఒకటి చొప్పున 14, మూడు మున్సిపాలిటీలకు 3 మొత్తం 17 యూనిట్లు కేటాయించింది. అదనంగా రూ.80,000 యూనిట్ సుల్తానాబాద్‌కు ఒకటి, రూ.1,40,000 యూనిట్ ఓదెలకు ఒకటి, రామగుండంకు రూ.1,80,000 యూనిట్ ఒకటి మొత్తం రూ.12,50,000 విలువైన యూనిట్లు మంజూరు చేసినట్లు డీడబ్ల్యూవో రవూఫ్ తెలిపారు.

18 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

ఈ నెల 18వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. 28 వరకు అవకాశం కల్పించారు. www.tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. దరఖాస్తు ఫాంతోపాటు సంబంధిత ధ్రువపత్రాలను మండల పరిషత్తు అధికారి, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో అందించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 94408 52495/99856 99702 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

లోన్ రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోండి



ఇదివరకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల్లో లోన్ రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు కులం, నివాసం, ఆదాయం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, దివ్యాంగులకు ఇచ్చిన సర్టిఫికెట్‌ను జత చేయాలి. ఈ అవకాశాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలి. వివరాలకు సంబంధిత జిల్లా సంక్షేమ శాఖ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల, వయోవద్ధుల సంక్షేమ శాఖ, పెద్దపల్లి కార్యాలయంలో సంప్రదించాలి.

– రవూఫ్, డీడబ్ల్యూవో

రూ.2 కోట్లతో చిట్టీల నిర్వాహకుడి పరారీ!

- బాధితుల ఆరోపణ
- అధికారులు న్యాయం చేయాలని వేడుకోలు



మాట్లాడుతున్న బాధితులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న మెలిగే రమేశ్ చిట్టీలు నడిపి, రూ.2 కోట్లతో పరారయ్యాడని బాధితులు ఆరోపించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్‌కు చెందిన రమేశ్ రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు చిట్టీలు ప్రారంభించాడు. కనిపించిన వారందరినీ నమ్మించడంతో సుల్తానాబాద్ పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల కూలీలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు చిట్టీలు వేశారు. ఈ క్రమంలో అతను నెల రోజులుగా కనిపించడం లేదు. ఆందోళనకు గురైన బాధితులందరూ మంగళవారం కదంబాపూర్ వెళ్లి, ఆరా తీశారు. ఏ విషయమూ తెలియకపోవడంతో సుల్తానాబాద్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో సమావేశమయ్యారు. కదంబాపూర్‌లో రమేశ్‌కు వ్యవసాయ భూమి ఉండటంతో ఎక్కడికి వెళ్లినా తిరిగి వస్తాడని అన్నారు. అయినప్పటికీ అధికారులు చొరవ తీసుకొని, తమ డబ్బులు ఇప్పించాలని కోరుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

భావ వ్యక్తీకరణకు భాష దోహదం



మాట్లాడుతున్న అశోక్ కాచే

మంథని: మాతృభాష గొప్పతనం విదేశాల్లో ఎక్కువ ఉంటుందని కాచే మెడికల్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (యూఎస్‌ఏ) వ్యవస్థాపకుడు డాక్టర్ అశోక్ కాచే అన్నారు. మన ఊరు మన కోచింగ్ కేంద్రంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా స్థానిక నృసింహ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. భాష భావవ్యక్తీకరణకు ఉపయోగపడుతుందని, మాతృభాష విద్యాబోధనలో ఎంతగానో ప్రయోజనం చేకూర్చుతుందని వివరించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మంథనిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించి బోధన పద్ధతులపై అధ్యాపకులతో మాట్లాడారు. డాక్టర్ వరలక్ష్మీ హరీశ్ కాచే, శశిభూషణ్ కాచే, మున్సిపల్ కౌన్సిలర్లు చొప్పకట్ల హనుమంతు, పెంద్రు రమాదేవి పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లకు ముగిసిన దరఖాస్తు గడువు



అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు

రామగుండం: డబుల్ ఇళ్ల కోసం ప్రభుత్వం ఆహ్వానించిన దరఖాస్తుల స్వీకరణ గడువు రామగుండం నియోజకవర్గంలో ముగిసింది. మొత్తంగా 7,672 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఎండీ.జాహెద్‌పాషా తెలిపారు. నియోజకవర్గ పరిధిలో కార్పొరేషన్‌తోపాటు అంతర్గాం, పాలకుర్తి మండలాలు ఉన్నాయి. గోదావరిఖని ఫైవింక్లయిన్‌లో 160 యూనిట్లకు 24 గృహాలు, ఎన్టీపీసీ జంగాలపల్లిలో 670 యూనిట్లకు కేవలం 300 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. అంతర్గాం మండల కేంద్రంలో గోలివాడ, విలేజి అంతర్గాం, టీటీఎస్ అంతర్గాం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు నిర్మితమైన 80 గృహాలు అసంపూర్తిగానే ఉన్నాయి. మిగతా గ్రామాల్లోని లబ్ధిదారులకు ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో సొంత స్థలం ఉన్నవారిని గుర్తించి పరిహారం అందిస్తామని ఇటీవల కలెక్టర్ పేర్కొన్న విషయం తెల్సిందే. పాలకుర్తి మండలంలోని పుట్నూర్ శివారులో 30 గృహాలు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. మొత్తంగా ఇప్పటివరకు 324 గృహాలు మాత్రమే సిద్ధమైన నేపథ్యంలో 7,672 దరఖాస్తులు రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు గైడ్‌లైన్స్ ప్రకారం లబ్ధిదారులను నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తామన్నారు.

ట్యాక్స్ చెల్లించకుంటే వాహనాలు సీజ్

జ్యోతినగర్(రామగుండం): సరుకు రవాణా జరిపే వాహన యజమానులు త్రైమాసిక పన్ను వెంటనే చెల్లించాలని, చెల్లించని వారి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ భీమ్‌సింగ్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో వాహన తనిఖీల క్రమంలో ఆయన మాట్లాడారు. తనిఖీల్లో త్రైమాసిక ట్యాక్స్ చెల్లించని 30 వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. సరుకు రవాణా చేసే హెవీ, మీడియం, లైట్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యజమానులు కొంతకాలంగా త్రైమాసిక ట్యాక్స్‌లు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. అత్యధికంగా ట్యాక్స్ చెల్లించని లారీలు, డీసీఎం, టాటా ఏసీ, బొలెరో వాహన యజమానులు సకాలంలో చెల్లిస్తే జరిమానాలపై 50 శాతం మాఫీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తనిఖీల్లో సీజ్ చేసిన వాహనాలకు 200 శాతం జరిమానా విధించడం జరుగుతుందని వివరించారు. దళిత బంధు ద్వారా వాహనాలు పొందిన వారు సైతం పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు.

కత్తితో తిరుగుతున్న వ్యక్తి అరెస్టు

- మానసిక స్థితి సరిగా లేకపోవడంతో హైదరాబాద్ తరలింపు



వెంకట ధనుంజయ్

గోదావరిఖని(రామగుండం): కత్తితో తిరుగుతున్న సింగరపు వెంకట ధనుంజయ్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉంటున్న ఇతను నాలుగు రోజుల క్రితం యైటింక్లయిన్‌కాలనీకి వచ్చాడన్నారు. సిక్కువాళ్ల వద్ద ఆటో దిగి, కత్తి కొనుగోలు చేశాడని పేర్కొన్నారు. పోచమ్మ మైదానం సమీపంలో తిరుగుతుండగా పోలీసులు అరెస్టు చేశారన్నారు. అతన్ని ముందుగా స్థానిక ఆస్పత్రికి తరలించగా మానసికస్థితి సరిగా లేదని వైద్యులు చెప్పడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ పంపించినట్లు సీఐ పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా



ట్రోఫీతో అంతర్గాం జట్టు

రామగుండం: మహాశివరాత్రి రోజు అంతర్గాం మండల కేంద్రంలో యైటింక్లయిన్ ఫుట్‌బాల్ టీం ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జట్లు, మహారాష్ట్ర నుంచి ఒక జట్టు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో అంతర్గాం జట్టు సత్తా చాటి, విజేతగా నిలిచింది. మంగళవారం ఫుట్‌బాల్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ.గణపతి ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గణపతి, సంతోష్, కృష్ణమూర్తి, నరేష్, వెంకటేశ్, శ్రీనివాస్, రాము, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

కిష్టంపల్లెలో యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని కిష్టంపల్లెకు చెందిన సాగర్ల పవన్‌కుమార్ (22) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్ తలకు బలమైన గాయమైంది. అప్పటి నుంచి మానసిక స్థితి సరిగాలేక ఇంట్లోనే ఉంటున్నాడు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి, క్రిమిసంహారక మందు తాగి, పడిపోయాడు. అతని స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వచ్చి, పవన్‌కుమార్‌ను పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోకి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు కమాన్‌పూర్ ఎస్సై షేక్‌మస్తాన్ పేర్కొన్నారు.

సింగరేణిలో విద్యుత్ ప్రమాదాలను నివారించాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ బిశ్వనాథ్ బెహరా

రామగిరి(మంథని): సింగరేణి సంస్థలో విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(ఎలక్ట్రికల్స్) బిశ్వనాథ్ బెహరా అన్నారు. ఆర్జీ–3 పరిధిలోని ఏఎల్‌పీ గనిని మంగళవారం సందర్శించి, విద్యుత్ సబ్‌స్టేషన్, ఎర్త్ పిట్‌లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై, మాట్లాడారు. విద్యుత్‌ను ఉపయోగించే సమయంలో రక్షణ సూత్రాలను పాటిస్తూ రక్షణ పరికరాలు ఉపయోగించాలని సూచించారు. అనుక్షణం అప్రమత్తతతో విధులు నిర్వహించాలని చెప్పారు. అనంతరం గని లోపలికి వెళ్లి, పరిశీలించారు. సమావేశంలో ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు, అధికారులు సతీరామం, బైద్య, వెంకటరమణ, ఎర్రన్న, రఘురాం, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు యూనిఫాంపై అభిప్రాయ సేకరణ



అభిప్రాయం తెలుసుకుంటున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు, అన్ని విభాగాలకు చెందిన కార్మికులకు అందించే యూనిఫాంపై జీఎం వెంకటేశ్వర్‌రావు మంగళవానం అభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి, గౌతం శంకరయ్య, అధికారులు సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా బొగ్గు తరలిస్తున్న లారీ పట్టివేత



లారీని పట్టుకున్న సెక్యూరిటీ అధికారులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజయ్‌గాంధీ నగర్‌లో మంగళవారం రైలు వ్యాగన్లలో నుంచి బొగ్గు దొంగిలించి, లారీల్లో తరలిస్తున్నారని సింగరేణి ఆర్జీ–1 ఎస్అండ్‌పీసీ అధికారులకు సమాచారం అందింది. సీనియర్ ఇన్స్పెక్టర్ రాంరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్లు తమ సిబ్బందితో దాడి చేశారు. బొగ్గు లోడుతో ఉన్న లారీని పట్టుకున్నారు. డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సింగరేణి అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ తెలిపారు.

ఆర్జీ–2 జీఎంతో సమావేశమైన ఓసీపీల జీఎం



సమావేశమైన జీఎంలు మనోహర్, గోపాలకృష్ణమూర్తి

గోదావరిఖని(రామగుండం): బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై ఆర్జీ02 జీఎం ఎ.మనోహర్‌తో ఓసీపీల జీఎం వై.గోపాలకృష్ణమూర్తి మంగళవారం సమావేశమయ్యారు. ఏరియాకు సంబంధించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాపై సమీక్షించారు. ఉత్పత్తికి విఘాతం కలగకుండా ముందుకెళ్లాలని నిర్ణయించారు. భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ప్రాజెక్టు ఇంజినీర్ దుర్గాప్రసాద్ ఉన్నారు.

డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకోండి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): గైర్హాజరు పేరుతో డిస్మిస్ అయిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖనిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మార్చి 5న భూపాలపల్లిలో జరిగే సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కేంద్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఎల్.ప్రకాశ్, సారయ్య, రాజ్‌కుమార్, వైవీ.రావు, మడ్డి ఎల్లాగౌడ్, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఐవోసీఎల్ డిపో ఎదుట మహిళల ఆందోళన

- బోర్‌వెల్ నుంచి దుర్వాసన, రంగు మారిన నీరు వస్తోందని ఆరోపణ



ఆందోళన చేస్తున్న మహిళలు

రామగుండం: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) డిపో ఎదుట మొగల్‌పహాడ్ గ్రామ మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. రెండు గంటలపాటు ట్యాంకర్ల రాకపోకలను అడ్డుకున్నారు. డిపో ప్రహరీ పక్కనే ఉన్న ఈ గ్రామంలోని యాదవ కాలనీలో గల బోర్‌వెల్ నుంచి కొంత కాలంగా దుర్వాసన, రంగుమారిన నీరు వస్తోందని ఆరోపించారు. డిపో తరఫున ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన డిపో మేనేజర్ రెండు రోజుల్లో గ్రామంలో పర్యటించి, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



తాగునీటి పునరుద్ధరణకు తవ్విన పైప్‌లైన్



దుర్వాసన వెదజల్లుతున్న టాయిలెట్స్

బల్దియాకు తాగునీటి గండం

కోల్‌సిటీ: పైన పటారం.. లోన లొటారం.. అన్నట్లుంది కార్పొరేషన్ కార్యాలయం. టాయిలెట్స్ నుంచి దుర్వాసన ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. నీటిచుక్క లేని ఫ్రిడ్జి వెక్కిరిస్తోంది. కార్యాలయానికి ఆరు నెలలుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో అధికారులు బయటి నుంచి మినరల్ వాటర్ తెప్పించుకుంటున్నారు. మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన టాయిలెట్స్, మూత్రశాలలకు నీరు రాకపోవడంతో దుర్వాసన వస్తోంది. ఇటీవల ఓ కాంట్రాక్టర్‌కు నీటి సరఫరా కోసం పనులు అప్పగించినప్పటికీ.. సకాలంలో పనులు పూర్తి కాలేదు. కార్యాలయానికే నీటి సరఫరా పునరుద్ధరించుకోలేని అధికారులు.. 50 డివిజన్ల సమస్యలపై ఎలా స్పందిస్తారని పలువురు విమర్శిస్తున్నారు.



నీటిచుక్క రాని ఫ్రిడ్జ్

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న కొమురయ్య

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ముప్పిరితోటకు చెందిన చీకటి కొమురయ్య అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి, తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. కొమురయ్య కొన్నేళ్లుగా పెద్దపల్లి పట్టణంలో కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి, కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయన తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కొమురయ్యను సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర న్యాయ సలహాదారు చీకటి సంతోష్‌గౌడ్, పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌లు మంగళవారం ఆస్పత్రికి పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న కొమురయ్యకు ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.15 వేలతోపాటు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.